మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ /వనపర్తి /జోగులాంబ గద్వాల /నారాయణపేట

## రూ.45 కోట్లతో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం...

**-ఎంపీ పోతుగంటి రాములు**



**కల్వకుర్తి,జూన్ 27 ప్రభాతవార్త:**రఘుపతిపేట-రామగిరి గ్రామాల మధ్య ప్రవహిస్తున్న దుంధుభి నదిపై రూ.45కోట్ల వ్యయంతో హైలెవల్ బ్రిడ్జిని ఏర్పాటు చేసి ప్రయాణీకులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడటానికి నిధులు మంజూరు చేసినట్లు ఎంపీ పోతుగంటి రాములు పేర్కొన్నారు. ఈప్రాంత ప్రజల చిరకాల అకాంక్ష అయిన రామగిరి-రఘుపతిపేట దుంధుభి నదీపై హైలెవల్ బ్రిడ్జిని నిర్మించి ప్రజల, ప్రయాణీకుల సౌకర్యార్థం సులభ్యంగా జరుగుతుందన్నారు. గతంలో కల్వకుర్తి, తెల్కపల్లి గ్రామాల ప్రజలు వర్షకాలం వచ్చిందంటే దుంధుభీ ప్రవహించడంతో ఇరు మండలాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారని, ఇచ్చిన ధరఖాస్తులకు రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు సానుకూలంగా స్పందించి మంజూరు చేయడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని ఆయన పేర్కొన్నారు. వర్షాలు కురిస్తే రాకపోకలు నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతూ కనీస సౌకర్యాలు కూడా కల్పించుకోలేని స్థితిలో ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, హైలెవల్ బ్రిడ్జి త్వరితగతిన పూర్తి చేసి ఈ ప్రాంత ప్రజల సమస్యలను పరిష్కరించడమే ధ్యేయమని ఆయన పేర్కొన్నారు. హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన సీఎం కేసీఆర్‌కు ఈ ప్రాంతం తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## వర్షాకాలంలో టార్గెట్ ప్రకారం హరితహారం..

**మొక్కలు నాటి సంరక్షించే బాధ్యత తీసుకోవాలి:జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**ఉట్కూర్,జూన్ 27 ప్రభాతవార్త :** వర్షాకాలంలో టార్గెట్ ప్రకారం హరితహారం మొక్కలు నాటి సంరక్షించే బాధ్యత తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఎంపిడిఓలను ఆదేశించారు. మంగళవారం ఉట్కూర్, మక్తల్ అవెన్యూ ప్లాంటేషన్ జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్‌తో పరిశీలించారు. మొక్కలు రోజుకు ఇరువైపులా నాటుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.వర్షాకాలంలో నాటడానికి ఫిట్టింగ్ సిద్ధం చేయాలన్నారు. ఈసందర్భంగా అలాగే తిప్పరాజుపల్లి శివారులో జిల్లా కలెక్టర్ మొక్కలు నాటి నీళ్లు పోశారు. రోడ్డు వెంట ఫిట్టింగ్ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఉట్కూర్‌లో నాటిన మొక్కలు పరిశీలించి ఈ యాప్ ద్వారా మొక్కలు నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే మల్లేపల్లి శివారులో అవెన్యూ ప్లాంటేషన్ పరిశీలించి లింగంపల్లి దగ్గర జడ్పీ ఛైర్‌పర్సన్ వనజమ్మతో కలిసి మొక్కలు నాటారు. అలాగే తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. అలాగే ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో ఖాళీగా ఉన్న క్వార్టర్స్‌ను పరిశీలించి గురుకుల జూనియర్ కళాశాల అందులోకి మార్చేందుకు పరిశీలించి అధికారులకు తగు సూచనలు జారీ చేశారు. అలాగే కస్తూర్బా విద్యాలయం 15 లక్షలు చేపట్టిన కంపౌండ్ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఓ, ఎంపిడిఓలు, తహసిల్దార్‌లు, మున్సిపల్ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.



అవెన్యూ ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

## జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయండి..

**- రెండు పడక గదుల ఇండ్ల నిర్మాణం ఆగస్టు నాటికి పూర్తి కావాలి**

**- మొదటి విడత మన ఊరు మన బడి పనుల ఆలస్యంపై కలెక్టర్ సీరియస్**

**వనపర్తి,జూన్27,ప్రభాతవార్త:** జిల్లాలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. మంగళవారం ఐడీవోసి సమావేశ మందిరంలో మన ఊరు మన బడి రెండు పడకల గదుల ఇండ్ల నిర్మాణం , రోడ్ల విస్తరణ, సీసీ రోడ్లు, మిషన్ భగీరథ పనులపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... మన ఊరు మన బడి కార్యక్రమం కింద చేపట్టిన పాఠశాలల పనులను వేగవంతం చేసి, 15 రోజుల్లో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ముఖ్యంగా 30 లక్షల లోపు ఉన్న పనులు ఆలస్యం చేయకుండా సత్వరమే పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మండలాల వారీగా ఇంకా పెండింగ్ ఉన్న పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మొదటి విడతలో చేపట్టిన పనులు ఇంకా పూర్తి కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉప్పరిపల్లి పాఠశాలకు పెయింటింగ్ వేయడంలో నిర్లక్ష్యం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరగా పనులు పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అదే విధంగా జిల్లాలో చేపట్టిన రోడ్ల విస్తరణ పనులపై సమీక్ష చేస్తు నాగర్‌కర్నూల్ నుండి వనపర్తి రోడ్డు పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, నాణ్యతలో లోపం లేకుండా చూడాలని ఆర్‌అండ్‌బి అధికారులను ఆదేశించారు. వర్షాకాలం వస్తుందని రోడ్లు ముందుగానే పూర్తి చేయాలని అదే విధంగా ఎక్కడైనా మరమ్మతు పనులు ఉంటే వాటిని సైతం త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పానుగల్ వైపు గల రోడ్ల మరమ్మతు పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గ్రామ పంచాయతీలలో చేపట్టిన సీసీ రోడ్లు, వైకుంఠధామం పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మిషన్ భగీరథ పైపులైన్‌ల పనులను త్వరగా పూర్తి చేసి ఇంటింటికి నల్లా నీరు అందించేందుకు కృషి చేయాలన్నారు. మక్తల్ కొత్తకోట ఇతర గ్రామాలకు తాగునీరు సక్రమంగా సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెండు పడక గదుల ఇండ్ల నిర్మాణ పనులను ఆగష్టు చివరి నాటికి పూర్తి చేయాలని ఇప్పటికే పూర్తి అయిన వాటికి విద్యుత్ సరఫరా ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. హరితహారంలో భాగంగా మొక్కలు నాటడం, రహదారులపై ప్లాంటేషన్ ఏర్పాటు చేయాలని, మొక్కలను సంరక్షించేందుకు బాధ్యులను నియమించాలని సూచించారు. జిల్లాలో సమీకృత వెజ్ నాన్‌వెజ్ మార్కెట్ భవనాల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని పబ్లిక్ హెల్త్ అధికారులను ఆదేశించారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఈఢబ్ల్యూ ఐడీసీ రామచంద్రం, టీఎస్.ఎంఐడిసి జైపాల్‌రెడ్డి, పంచాయతీ రాజ్ ఈఈ మల్లయ్య, మిషన్ భగీరథ ఈఈ మేఘారెడ్డి, ఆర్‌అండ్‌బి ఈఈ దేశ్యనాయక్, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



సమావేశానికి హాజరైన జిల్లా అధికారులు

- **పార్టీలో చేరుతున్న కీలక నేతలు**
- **ఓటర్లకు దగ్గరయ్యేందుకు సమావేశాలు..**
- **కర్ణాటక గెలుపుతో మరింత జోష్**
- **'చెయ్యి' అందుకునేందుకు జూపల్లి సిద్ధం..**
- **అదేబాటలో గుర్నాథ్‌రెడ్డి, కూచకుళ్ల రాజేశ్వర్‌రెడ్డి, మేఘారెడ్డి..**
- **రెండు వారాల్లో భారీ బహిరంగ సభకు సన్నాహాలు**
- **మారనున్న రాజకీయ సమీకరణాలు..**

## కాంగ్రెస్‌కు.. కలిసొచ్చేనా..!

ఎన్నికల సమయం సమీపిస్తుండడంతో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. టీపీసీసీ రేవంత్ రెడ్డి పార్టీ బలోపేతానికి, అధికారంలోకి వచ్చేందుకు విశ్వప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇప్పటికే తమదైన శైలిలో ప్రజల్లో ఉండేందుకు సమావేశాలు, సభలు నిర్వహిస్తూనే పార్టీలో చేరికలపై ఫోకస్ పెంచారు. కాంగ్రెస్ శ్రేణుల్లో జోడో యాత్రతో జోష్ పెంచిన రాహుల్ గాంధీ ఇటీవల కర్ణాటక ఫలితాలతో తెలంగాణలోనూ తాము అధికారంలోకి వస్తామనే ధీమా పార్టీ శ్రేణుల్లో మరింత పెరిగింది. దీనికితోడు రాష్ట్రంతో పాటు ఉమ్మడి జిల్లాలోనూ పలువురు కీలక నేతలు హస్తం చెంతన చేరేందుకు ముహూర్తం కూడా ఖరారు కావడంతో పార్టీలో నూతనోత్సాహం కనిపిస్తున్నది.

*- మహబూబ్‌నగర్ బ్యూరో,జూన్ 27, ప్రభాతవార్త*



కాంగ్రెస్ పార్టీకి కాలం కలిసొస్తుందా అంటే అవుననే అంటున్నాయి మారుతున్న పరిస్థితులు. టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రేవంత్ రెడ్డికి సీనియర్ల నుంచి కాస్త ఇబ్బందులు, సమన్వయ లోపం ఎదురైనా మొత్తానికి అందరినీ కలుపుకొని ముందుకు సాగుతున్నారు. ఇందులో బలోపేతానికి సర్వ శక్తులు ఒడ్డుతూ ముందుకు నడిపిస్తున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారు.భారీగా చేరికలకు ప్రణాళికలు చేస్తూనే పట్టు పెంచుకునేలా ప్రయత్నాలు మొదలుపెట్టారు.

**పాలమూరుపై ఫోకస్..**

ఉమ్మడి జిల్లా కల్వకుర్తికి చెందిన రేవంత్ రెడ్డి తన రాజకీయ జీవితం మిడ్జిల్ నుంచే ప్రారంభించిన విషయాన్ని ఇటీవల జడ్చర్లలో నిర్వహించిన సభలో ప్రస్తావించారు. పాలమూరు బిడ్డగా కాంగ్రెస్ పార్టీని నడిపించే అవకాశాన్ని తనకు కట్టబెట్టిన సోనియాగాంధీ రుణం తీర్చుకునే సమయం వచ్చిందని ఉమ్మడి జిల్లాలో 14 సీట్లలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని పలు మార్లు చెబుతూ వచ్చారు. ఇప్పటికే జోడోయాత్ర,జడ్చర్లలో మల్లు భట్టి విక్రమార్క పాదయాత్ర సభ, మహబూబ్‌నగర్‌లో నిరుద్యోగ గర్జన, బిజినేపల్లిలో దళితుల ఆత్మగౌరవ సభలాంటి నిర్వహించిన ప్పుడు రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్ర సంగించారు. పాలమూరుపై ఫోకస్ పెం చిన పార్టీ అధ్యక్షుడు బీఆర్ఎస్ అసంతృప్తిదా రులతో సమావేశమయ్యారు. కాంగ్రెస్ పార్టీలో చేరాలని బీఆర్ఎస్‌ను గద్దె దింపే దిశగా కలిసి అడుగులు వేద్దామంటూ పిలుపునిచ్చారు.

**జూపల్లితోపాటు మరికొందరు..**

ఇటీవల రేవంత్‌రెడ్డితో కలిసి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు సమావేశమైన సంగతి తెలిసిందే. తాజాగా సోమవారం ఢిల్లీలో జూపల్లి తన ముఖ్య అనుచరులతో కలిసి రాహుల్‌గాంధీతో సమావేశమయ్యారు.టీఆర్ఎస్ అసంతృప్తులతో కలిసి జూపల్లి పలుమార్లు మాట్లాడుతూ వచ్చారు. తనతో కలిసి నడవాలని కోరుతూ వచ్చారు. ఈక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి తనయుడు కూచకుళ్ల రాజేశ్వర్‌రెడ్డి , పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డి అందరూ కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ముహూర్తం ఫిక్స్ చేశారు. జూలై రెండో వారంలో నాగర్‌కర్నూల్ లేదా కొల్లాపూర్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు సమాయత్తమవుతున్నారు. ఇదే రోజు అందరూ కాంగ్రెస్ పెద్దల సమక్షంలో పార్టీలో చేరనున్నట్లు తెలుస్తున్నది. భారీ బహిరంగ సభకు రాహుల్ గాంధీతోపాటు, ప్రియాంక గాంధీ హాజరుకానున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ సభ అనంతరం ఉమ్మడి పాలమూరులో మరి కొంత మంది నేతలు పార్టీలో చేరేలా.

**పథకాలతో ప్రజల్లోకి..**

కాంగ్రెస్ పార్టీ పథకాలను మరింత ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో కొన్ని పథకాలు సైతం కీలకంగా దోహదపడ్డాయని మేధావులు చెబుతున్నారు. ముఖ్యంగా రూ.2లక్షలు ఏకకాలంలో రుణమాఫీ, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.500 వంట గ్యాస్ సిలిండర్, 18 ఏండ్లు దాటిన యువతులకు ఎలక్ట్రిక్ స్కూటీ, అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదే 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామంటూ వంటి పథకాలతో ఓటర్లను ఆకర్షించేందుకు దోహదపడనున్నాయని రాజీకయ విశ్లేషకులు చెబుతున్నారు. అయితే ఉమ్మడి పాలమూరులో బలమైన శక్తిగా ఎదిగి, రెండు సార్లు అత్యధిక సీట్లు సాధించిన బీఆర్ఎస్‌ను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ బలం ఏమేరకు దోహదం చేస్తుందో వేచి చూడాల్సిందే..

**బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం కాంగ్రెస్సే..**



ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు చేసిన సోనియా గాంధీ రుణం తీర్చుకునే అవకాశం వచ్చింది. తెలంగాణ ఏర్పడ్డాక బాగుపడ్డది ఒక్క కేసీఆర్ కుటుంబమే..యువత, రైతులు అన్ని విధాలా మోసం పోయారు. సాధించుకున్న తెలంగాణ లక్ష్యం నీళ్లు,నిధులు,నియామకాలు,అమరవీరుల ఆశయాలు నెరవేరాలంటే కాంగ్రెస్ వల్లే సాధ్యం. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పార్టీ బలం పుంజుకుంటున్నది. జిల్లాల్లో ఎక్కడికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తాం. వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..

*- జి మధుసూదర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు*

## గ్రూప్-4 పరీక్షలను అత్యంత పకడ్బందిగా నిర్వహించాలి...

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 27 ప్రభాత వార్త:**నాగర్‌కర్నూల్ జిల్లాలో జూలై 1న నిర్వహించే గ్రూప్-4 పరీక్షలను అత్యంత పకడ్బందిగా పారదర్శకంగా నిర్వహించాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ పరీక్షల నిర్వహణ అధికారులను ఆదేశించారు. మంగళవారం నూతన సమీకృత జిల్లా కార్యాలయ సముదాయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 16,637 మంది అభ్యర్థులు గ్రూప్-4 పరీక్షలను రాస్తున్నందున వారికి కోసం జిల్లాలోని 50 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. పేపర్ 1 ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30, పేపర్ 2 మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 15 నిముషాల ముందుగానే గేట్లను మూసివేయాలనా న్నరు. పరీక్ష కేంద్రాల్లోకి ఐడీ కార్డ్స్, హాల్ టికెట్ లేకుండా అభ్యర్థులను అను మతించవద్దని సూచించారు. అభ్యర్థులు బూట్లు, బెల్ట్, ఎలక్ట్రానిక్ పరికరాలు ధరిస్తే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించరాదని ఆదే శించారు. ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమె రాలతో లైవ్ టెలికాస్ట్ ద్వారా రికార్డు చేయాలని ఆదేశించారు. 50 పరీక్ష కేంద్రాల్లో కొనసాగే పరీక్షల ప్రక్రియను జిల్లా కేంద్రం నుంచి నేరుగా ప్రత్యక్షంగా పరీక్షించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పరీక్ష కేంద్రాలను చీఫ్ సూపరింటెండెంట్లు, లైజన్ అధికారులు ముందుగా సందర్శించి తాగునీరు, మరుగు దొడ్లు, విద్యుత్, ఫ్యాన్లు, ఫర్నిచర్, సీసీ కెమెరాల పనితీరును పర్యవేక్షించాలన్నారు. పరీక్షలు జంబ్లింగ్ పద్ధతిన నిర్వహించను న్నందున అభ్యర్థులకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. పరీక్ష సమయం ముగిసే 15 నిముషాల ముందు అభ్యర్థి ఎడుమ వేలిముద్ర నామినల్ రోల్‌పై తీసుకోవాలని సూచించారు. 396 మంది దివ్యాంగులు పరీక్షలకు హాజరు కానున్నారని, దివ్యాంగులకు భవనంలోని క్రింది ఫ్లోర్‌లో ఉన్న గదులను కేటాయించాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నందున సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని, అభ్యర్థులను తనిఖీ చేసి పరీక్ష కేంద్రాల్లోకి పంపాలన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో 18, కల్వకుర్తిలో 11, అ చ్చంపేటలో 8, బల్మూర్‌లో 2, బిజినపల్లిలో3,పెద్ద కొత్తపల్లిలో 1, తెల్కపల్లిలో 4, తిమ్మాజిపేటలో 2, వెల్దండలో 1 పరీక్ష కేంద్రం చొప్పున మొత్తం 50 పరీక్ష కేంద్రాలను ఎంపిక చేసినట్లు, ఎలాంటి ఇబ్బందులు పొరపాట్లకు తావివ్వకుండా గ్రూప్ 4 పరీక్షలను అత్యంత పకడ్బందిగా పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. నిర్ణిత గడువులో సీసీ కెమెరాల రికార్డుతో పరీక్ష ప్రశ్నపత్రాలను ఇద్దరు విద్యార్థుల సమక్షంలో ఓపెన్ చేసి ఆ విద్యార్థుల సంతకాలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎస్.మోతిలాల్, ఏఎస్పీ ప్రభుత్వ పరీక్షల నిర్వహణ అధికారి రాజశేఖర్‌రావు, జిల్లా అధికారులు, ఆర్డీఓలు చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, రూట్ అధికారులు,లైజన్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు తదితరులు ఉన్నారు.



జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్



సమీక్షా సమావేశానికి హాజరైన అధికారులు

## కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలు..

**టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్**

**నవాబ్‌పేట,జూన్ 27 ప్రభాతవార్త :** మండలంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ హాజరయ్యారు. రాష్ట్ర అధికార ప్రతినిధి నియమించిన జహీర్ అక్తర్‌ను ఎర్రశేఖర్ సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలన్నారు. నవాబ్‌పేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కెసిఆర్ పాలనకు చరమగీతం పాడాలని తెలంగాణ అమరవీరుల కుటుంబాలను కనీసం పట్టించుకోని ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశంలో రాహుల్‌గాంధి నేతృత్వంలో, రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



## ఫింగర్ ప్రింట్ సేవలతో ఉత్తమ ఫలితాలు..

**- డీజీపీ నుంచి ప్రశంసా పత్రం అందుకున్న ఎస్పీ నరసింహ**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్27, ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని 2023 మొదటి మూడు నెలల నివేదిక ప్రకా రం ఎంఎస్‌సీడీ( మొబైల్ సెక్యూరిటీ చెక్ డివైస్) మొబైల్ ఫింగర్ ప్రింట్ లైవ్ స్కానర్ ఉపయోగించి కేసులను ఛేదించినందుకుగానూ మహబూబ్‌నగర్ ఎస్పీ నరసింహను డీజీపీ అంజనీకుమార్ అభినం దించారు. ఈమేరకు హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ఎస్పీకి ప్రశంసాపత్రం అందజేశారు. ఫింగర్ ప్రింట్ లైవ్ స్కానర్ ద్వారా అనుమానాస్పద వ్యక్తుల పూర్వాపరాల ధ్రువీకరణ, ఫింగర్ ప్రింట్ సేవలను ఉపయోగంతో ఉత్తమ ఫలితాలు సాధించినందుకు గానూ పనితీరును మెచ్చి సోమవారం నిర్వహించిన నెలవారీ సమీక్షలో భాగంగా డీజీపీ చేతులమీదుగా ఎస్పీ అవార్డు అందుకున్నారు.



## జూలై2న అరుణాచలానికి ప్రత్యేకబస్సు..

**- రెండు రోజుల ప్యాకేజీని ప్రకటించిన ఆర్టీసీ**

**- మహబూబ్‌నగర్ డిపో నుంచి బస్సు**

**మహబూబ్‌నగర్ బ్యూరో,జూన్27,ప్రభాతవార్త:** జూలై 3న పౌర్ణమి సందర్బంగా మహబూబ్‌నగర్ డిపో నుంచి ఆర్టీసీ ఒక రోజ ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించింది. జూలై2న ఉదయం 8గంటలకు మహబూబ్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్ నుంచి అరుణాచలానికి బస్సు బయలుదేరుతుంది. మార్గమధ్యంలో కాణిపాకంలో విఘ్నేశ్వరుడి దర్శనానంతరం రాత్రి 8గంటలకు బయలుదేరి రాత్రి 10గంటలకు చేరుకుంటుంది. జూలై3న అరుణాచల గిరిప్రదక్షణ అనంతరం సాయంత్రం 3గంటలకు బయలుదేరి వేలూరులో గోల్డెన్ టెంపుల్ దర్శనానంతరం మహబూబ్‌నగర్‌కు 4వ తేదీన ఉదయం 8గంటలవరకు చేరుకుంటుంది. ఈ యాత్రను ఒక టూర్ ప్యాకేజీగా ఆర్టీసీ అందిస్తున్నది. అరుణాచలం వెళ్లాలనుకునే వారు ఈప్యాకేజీని సద్వినియోగం చేసుకోవాలని మహబూబ్‌నగర్ డిపో మేనేజర్ తెలిపారు. ఈ ప్యాకేజీకుగానూ పెద్దలకు బస్సు చార్జీ రూ.3100, పిల్లలకు అనగా హాఫ్ టికెట్ వారికి రూ.1600గా టికెట్ ధరను నిర్ణయించారు. కావునా అరుణాచలం వెళ్లేవారు ఆర్టీసీ డిపో మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ 9959226286, 9441162588 సెల్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.



## మత్తునుంచి కాపాడుదాం.. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకుందాం..!

**మహబూబ్‌నగర్ బ్యూరో,జూన్ 27 ప్రభాతవార్త :** మత్తు పదార్థాల నివారణతో పాటు, యువత మత్తు పదార్థాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకుని కృషి చేయాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ జి.రవినాయక్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మత్తు పదార్థాల నివారణ, అక్రమ రవాణా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహబూబ్‌నగర్‌లోని సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మారుతున్న జీవన పరిస్థితులు, ఆర్థిక పరిస్థితుల కారణంగా కళాశాలలు, విశ్వ విద్యాలయాలతో పాటు, ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు సైతం మత్తు పదార్థాలకు బానిసలు అవుతున్నారని, అలాగే విద్యార్థులతో పాటు, సాధారణ సమాజం సైతం మత్తు పదార్థాల బారిన పడటం బాధాకరమని అన్నారు. యువత ప్రత్యేకించి విద్యార్థులు మత్తు పదార్థాల బారిన పడకుండా అవగాహన కల్పించడంతో పాటు, ఎవరైనా పొరపాటున మత్తు పదార్థాలకు బానిసలైనట్లయితే వారికి చికిత్స అందిస్తూనే పునరావాస కేంద్రాల ద్వారా వారిని బాగు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రభుత్వం తరపు అలాగే స్వచ్ఛంద సంస్థలు పెద్ద ఎత్తున అవగహన కార్యక్రమాన్ని చేస్తున్నప్పటికి కొన్ని విషయాల పట్ల ముఖ్యంగా మత్తు పదార్థాల విషయం పట్ల కఠినంగా ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా కాపాడాల్సిన అవసరం ఉందని తెలిపారు. కల్లు,సారా అదేవిధంగా గుట్కా ఇతర మత్తుకు సంబంధించిన మందులు అన్నింటి వల్ల కలిగే క్షణిక సంతోషం గురించి సోషల్ మీడియాలో వస్తున్నటువంటి అంశాలపై సైతం దృష్టిలో ఉంచుకుని ఏ ఒక్కరూ మత్తు పదార్థాల బారిన పడకుండా అందరూ పనిచేసి 100 శాతం నివారించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అంతకు ముందు ఉదయం జిల్లా పరిషత్ మైదానం నుండి తెలంగాణ చౌరస్తా వరకు నిర్వహించిన ర్యాలీని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డితో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యువత డ్రగ్స్‌కు అలవాటు పడితే చాలా ఇబ్బందులు ఉంటాయని, అందువల్ల అందరు జాగ్రత్తగా ఉండాలని, ముఖ్యంగా పిల్లల బారిన పడకుండా తల్లిదండ్రులు చూసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. సమాజం ఆరోగ్యంగా ఉన్నప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ర్యాలీకి హాజరైన జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ సమాజాన్ని పట్టిపీడిస్తున్న అతిపెద్ద సమస్య మత్తు పదార్థాల సమస్యని అన్నారు. యువత మత్తు మందుల బారిన పడకుండా అందరు కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఎంతో మంది యువతీ, యువకులు మత్తు పదార్థాలకు బానిసలై వారి జీవితాలను నాశనం చేసుకోవడంతో పాటు, కుటుంబాలను సైతం నాశనం చేస్తున్నారని, యువత ఇలా పక్కదారి పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, వాళ్లందరిని మంచి మార్గంలో తీసుకురావాల్సిన అవసరం ఉందని, వ్యసనాలకు బానిస కాకుండా చూడాల్సిన బాధ్యతను అందరు స్వీకరించాలని కోరారు. జిల్లా ఎస్పీ కె. నరసింహ మాట్లాడుతూ జిల్లాలో మత్తు పదార్థాల నివారణకు అదేవిధంగా యువత మత్తు పదార్థాల బారిన పడకుండా ఉండేందుకు అన్ని శాఖలు సమన్వయంతో కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. జిల్లాలో మత్తుమందుల నివారణలో భాగంగా 14 మందిని గుర్తించడం జరిగిందని, దీనిని పూర్తిగా నిరోధించడంలో అందరి సహాయ సహకారాలు అవసరమని, అదేవిధంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మత్తుపదార్థాల నివారణకు ఉద్దేశించిన జిల్లాస్థాయి కమిటీలు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన వివిధ శాఖల అధికారులు సభ్యులుగా కమిటి ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఈ కమిటీ మత్తుపదార్థాల నివారణ, నిషేధానికి కృషి చేయాలనిఆయన పిలుపునిచ్చారు. ఇంఛార్జి జిల్లా సంక్షేమ అధికారి, జడ్పీ సీఈఓ జ్యోతి, డీఈఓ రవిందర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సైదులు, సిడబ్ల్యూసీ ఛైర్మన్ నయీమ్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి రహమాన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాల నివారణకై ఉద్దేశించిన వాల్ పోస్టర్‌ను జిల్లా కలెక్టర్, ఎస్పీలు విడుదల చేయగా, అంతేకాక మత్తు పదార్థాలను వినియోగించడం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించే నిమిత్తం ఏర్పాటు చేసిన సిగ్నేచర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రాములు, డిఎస్పీ మహేష్, పోలీస్ అధికారులు, ఎక్సైజ్ అధికారులు, మహిళా శిశు సంక్షేమశాఖ అధికారులు, విద్యాశాఖ అధికారులు హాజరయ్యారు. ర్యాలీలో జిల్లా కలెక్టర్, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డితో పాటు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ రవినాయక్, జడ్పీ ఛైర్‌పర్సన్ స్వర్ణమ్మ, ఎస్పీ నరసింహ



ప్రతిజ్ఞ చేస్తున్న పోలీస్, జిల్లా అధికారులు

# గ్రూప్-4కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**●మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ జి. రవినాయక్**




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, జూన్ 27 ప్రభాతవార్త :** జులై 1న నిర్వహించే గ్రూప్ 4 పరీక్షలను ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జి. రవినాయక్ ఆదేశించారు. గ్రూప్ 4 పరీక్షల నిర్వహణ విషయమై మంగళవారం ఆయన సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్లు, లైజన్ అధికారులు, రూట్ అధికారులు తదితరులతో సమావేశం నిర్వహించారు. గ్రూప్ 4 పరీక్షలు అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని,ఏ ఒక్క చోట తప్పు జరగరాదన్నారు. అందువల్ల గ్రూప్ 4 పరీక్షలకు నియమించబడిన అధికారులందరు అప్రమత్తంగా ఉండి పరీక్షలు నిర్వహించాలన్నారు. ఎన్నికల విధుల మాదిరిగానే గ్రూప్ 4 పరీక్షలను నిర్వహించాలని, ఇందుకుగాను ముందుగా పరీక్షల నిర్వహణకై చేపట్టబోయే చర్యలపై ఒక చెక్‌లిస్టు తయారు చేసుకోవాలని సూచించారు. పరీక్షల నిర్వహణపై ఎలాంటి నిర్లక్ష్యాన్ని ప్రదర్శించవద్దని, టిఎస్‌పిఎస్సీ జారీ చేసిన సూచనలను ఒకటికి రెండుసార్లు చదవాలని, ఆయా పరీక్ష కేంద్రాలలో మౌలిక సదుపాయాలు మరోసారి తనిఖీ చేయాలని, అన్ని సెంటర్లలో తప్పనిసరిగా సిసి కెమెరాలు ఉండాలని, ఒకవేళ ఎక్కడైనా లేనట్లయితే ఈనెల 29 లోగా ఏర్పాటు చేయాలని, అదేవిధంగా ప్రతి తరగతి గదిలో వాల్ క్లాక్ ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రూట్ అధికారులు ముందుగానే వారికి కేటాయించిన రూట్‌లను తనిఖీ చేసుకోవాలని, ప్రశ్నా పత్రాలు తీసుకువెళ్లే వాహనం ఎక్కడైనా పొరపాటున రిపేర్ కారణంగా ఆగిపోతే తక్షణమే స్పేర్ వాహన పంపించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అభ్యర్థుల గుర్తింపు కార్డు చూసిన తర్వాతే లోపలికి అనుమతించాలని అన్నారు. పరీక్షల సందర్భంగా 24గంటల విద్యుత్ సరఫరా ఉండాలని, ఎక్కడ విద్యుత్ అంతరాయం ఏర్పడకూడదని, అలాగే అన్ని పరీక్ష కేంద్రాల వద్ద అవసరమైన తాగునీరు, ప్రథమ చికిత్స వంటి ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అభ్యర్థులను తనిఖీ చేసేందుకు ఆయా కేంద్రాలలో తప్పనిసరిగా మనుషులను ఏర్పాటు చేయాలని మహిళా అభ్యర్థులను తనిఖీ చేసేందుకు ఖచ్చితంగా మహిళలు మాత్రమే ఉండాలని, దీంతోపాటు మహిళా అభ్యర్థులను తనిఖీ చేసేందుకు తెరలాంటి ఏర్పాటు చేయాలని, అభ్యర్థుల వస్తువులను భద్రపరచుకునేందుకు క్లాక్‌రూమ్ ఏర్పాటు చేయాలని అన్నారు. కాగా జులై 1వ తేదీన నిర్వహించే గ్రూప్ 4 పరీక్ష ఉదయం 10 గం.ల నుండి 12.30 గం.ల వరకు తిరిగి మధ్యాహ్నం 2.30 గం.ల నుండి సాయంత్రం 5 గం.ల వరకు రెండు విడతల పరీక్షలు ఉంటాయన్నారు. జిల్లాలో గ్రూప్ 4 పరీక్షల నిర్వహణకు గాను 111 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 34,459 మంది అభ్యర్థులు గ్రూప్ 4 పరీక్షలకు హాజరు కానున్నారని, 111 మంది చీఫ్ సూపరింటెండెండ్లు, 111 మంది లైజన్ అధికారులు, 20 మంది రూట్ అధికారులను గ్రూప్ 4 పరీక్షల నిర్వహణకు నియమించినట్లు కలెక్టర్ వెల్లడించారు. అభ్యర్థులను ఉదయం 8గం.ల నుండి పరీక్ష కేంద్రంలోకి అనుమతించడం జరుగుతుందని, 9.45 గం.లకు పరీక్ష కేంద్రం గేట్లు మూసివేయడం జరుగుతుందని, అలాగే మధ్యాహ్నం నిర్వహించే పేపర్‌కు సంబంధించి మధ్యాహ్నం 1 గం.ల నుండి పరీక్ష కేంద్రంలోకి అనుమతించడం జరుగుతుందని 2.15గం.లకు గేటు వేయడం జరుగుతుందని, దాని తర్వాత అభ్యర్థులను లోపలికి అనుమతించడం జరగదని తెలిపారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రంలోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ గాడ్జిట్లు, పెన్‌డ్రైవ్‌లు, బ్లూటూత్‌లు వంటివి తీసుకువెళ్లేందుకు అనుమతించడం జరగదని స్పష్టం చేశారు. ఓఎంఆర్ ఆన్సర్‌షీట్‌పై వైట్‌నర్, చాక్‌పౌడర్, బ్లేడ్, ఎరైజర్ వంటివి ఉపయోగిస్తే ఓఎంఆర్ ఆన్సర్ షీట్‌ను పరిగణనలోకి తీసుకోవడం జరగదని స్పష్టం చేశారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ కె. సీతారామారావు మాట్లాడుతూ గ్రూప్ 4 పరీక్షల విధులకు నియమించిన అధికారులు, సిబ్బంది అందరు తప్పనిసరిగా విధులకు హాజరు కావాలని, లేనట్లయితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదనపు ఎస్పీ రాములు మాట్లాడుతూ గ్రూప్ 4 పరీక్షల నిర్వహణ సందర్భంగా జిల్లాలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామని, పరీక్ష కేంద్రాల పరిధిలో 144వ సెక్షన్ విధించడం జరుగుతుందని, అంతేకాక పరిసర ప్రాంతాలలో జిరాక్స్ కేంద్రాలను మూసివేయడం వంటి చర్యలను తీసుకోవడం జరుగుతుందని వెల్లడించారు.



హాజరైన అధికారులు

# ప్రతి రోగికి ఆత్మస్థైర్యం కల్పించాలి

**- ఎయిడ్స్ ఐసిటిసి కౌన్సిలర్ బండారు శ్రీనివాస్**

**వనపర్తి వైద్య విభాగం,జూన్27,ప్రభాతవార్త:** సమాజంలో ప్రతి ఒక్కరు ఎయిడ్స్ రోగులకు ఆత్మ స్థైర్యం కల్పించేలా ఉండాలని ఎయిడ్స్ కేంద్ర ఐసిటిసి కౌన్సిలర్ బండారు శ్రీనివాసులు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సంపూర్ణ హెచ్‌ఐవీ, ఎయిడ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హెచ్‌ఐవి, ఎయిడ్స్ రోగం అంటే అంటు వ్యాధి కాదని, సుఖరోగాల పునరుత్పత్తి వ్యవస్థ ద్వారా సంక్రమించే వ్యాధి అని అన్నారు. హెచ్‌ఐవి పాజిటివ్ ఉన్న వ్యక్తితో కలిసి తిరగడం , ఆటలాడడం, భోజనం చేయడం ద్వారా ఎలాంటి వ్యాధి సోకదన్నారు. దీర్ఘకాలిక జబ్బులను కట్టడి చేసే ఏఏ పద్ధతుల ద్వారా హెచ్‌ఐవి , ఎయిడ్స్ సంక్రమణ జరుగుతుందనే విషయాలను విద్యార్థులకు వివరించారు. సమాజంలో మనలో ఒకరికిగా ఆదరించాలని, వ్యాధిగ్రస్తులకు సంపూర్ణ సురక్ష కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. ప్రతి విద్యార్థి సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు అధ్యాపకురాలు నాయకంటి సరోజ, ఎండి ఇబ్రహీం, శేఖర్, డాక్టర్ ఆనంద్,మహేంద్రసింగ్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలోని బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సంపూర్ణ హెచ్‌ఐవీ, ఎయిడ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

# మాదక ద్రవ్యాల నిషేధంపై ర్యాలీ

**జెండా ఊపి ప్రారంభించిన అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్**




జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న దృశ్యం

**గద్వాల ప్రతినిధి, జూన్ 27 ప్రభాతవార్త :** అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని మిషన్ పరివర్తన అనే అంశంపై జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో మహిళా శిశు దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ జోగులాంబ గద్వాల వారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని మాదక ద్రవ్యాల నిషేధంపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్ హాజరయ్యారు. ముందుగా కార్యక్రమం సంబంధించిన పోస్టర్లను, డిడబ్ల్యుఓ ముసాయిదాబేగం, డీఎస్పీ రంగస్వామి, ఆబ్కారి ఇన్స్‌పెక్టర్ గోపాల్, డీఈఓ సిరాజుద్దిన్, సిడబ్ల్యుసి మెంబర్ జయభారతి, శైలజ తదితరులు విడుదల చేశారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ అపూర్వ చౌహాన్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల ప్రాణాంతక వినియోగం యువత జీవితాలను నాశనం చేస్తుందని డ్రగ్స్ తీసుకోవడం, పొగ త్రాగడం ఇంజక్షన్ చేయడం లేదా తినడం వల్ల మానసిక, శారీరక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. కావున అందరు ఈ మాదకద్రవ్యాల నిర్మూలన కోసం కృషి చేయాలని అన్నారు. కార్యక్రమం అనంతరం ఎంఎఎల్డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల నిషేధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి జిల్లా సంక్షేమ అధికారి ముసాయిదాబేగం, ఆబ్కారి ఇన్స్‌పెక్టర్ గోపాల్ హాజరై ప్రసంగించారు. జిల్లా సంక్షేమ అధికారి మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు సేవించడం ద్వారా అనేక రకాలైన సమస్యలు గురవుతారని అలాగే మానసిక రుగ్మతలు అనుభవించడంతో పాటు తెలివితేటలు తగ్గడం, అకాల మరణాలు సంభవిస్తాయని అన్నారు.కావున దీనిపై అందరు అవగాహన కలిగి ఉండి బంగారు భవిష్యత్తు కాపాడుకోవాలని తెలియజేశారు.కార్యక్రమంలో ఆబ్కారి ఇన్స్‌పెక్టర్ గోపాల్, సిడబ్ల్యుసి మెంబర్స్ జయభారతి, శైలజ,డిసిపిఓ నరసింహ,ఎస్సై రామస్వామి, ప్రిన్సిపల్ శ్రీపతినాయుడు, ఐపిఎస్ సిబ్బంది , సచ సిబ్బంది, భరోసా సిబ్బంది, అంగన్‌వాడి టీచర్స్ చైల్డ్ లైన్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రమాణం చేస్తున్న అధికారులు



పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

## పాలమూరు సౌరభ దాస సాహిత్య విద్యాలయంలో ప్రవేశాలు

**- బ్రాహ్మణ అభ్యర్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం..**





**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్27, ప్రభాతవార్త:** శ్రీ ఉత్తరాదిమఠాధీశులైన శ్రీ సత్యాత్మతీర్థస్వామిజీ వారిచే స్థాపించబడిన సౌరభదాస సాహిత్య విద్యాలయం పాలమూరు శాఖ వారిచే దాస సాహిత్యం అన్ని వర్గాలలో వార్షిక పరీక్షలను శని, ఆదివారాల్లో స్థానిక పాలమూరులోని శ్రీ ఉత్తరాధిమఠంలో నిర్వహించారు. ఇందులో భాగంగా అత్యంత శ్రద్ధతో పరీక్షలు రాశారు. పరీక్షలను విద్యాలయ సంచాలకులు శశిరేఖ, మఠం వ్యవస్థాపకులు ప్రశాంత ఆచార్యులు , ఆనంత పద్మనాభ ఆచార్యులు ,శ్రీమోహనరావు విఠాలాపూర్ , శ్రీ రఘుప్రేమ ఆచార్యులు సహకారంతో నిర్వహించినట్లు తెలిపారు. ఈ విద్యాసంవత్సరంఅన్ని వర్గాల్లో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు తెలిపారు. కావునా సకల బ్రాహ్మణులు వయస్సుతో నిమిత్తం లేకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## కౌకుంట్ల పురషోత్తంరెడ్డికి అభినందనలు



**దేవరకద్ర,జూన్ 27 ప్రభాతవార్త :** కౌకుంట్ల మండలానికి చెందిన సూరక్క నాగన్న కుమారుడైన పురుషోత్తంకు సెంట్రల్ గవర్నమెంట్ జాబ్, ఎల్ఐసి డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా జాబ్ రావడం వల్ల కౌకుంట్ల మండల సర్పంచ్ స్వప్న కిషన్‌రావు,జడ్పీటిసి అన్నపూర్ణ శ్రీకాంత్, వైస్ ఎంపిపి సుజాత శేఖర్‌రెడ్డి, ఎంపిటిసి కిష్టన్న, ప్రముఖ సామాజికవేత్త, కావలి పవన్‌కుమార్ యాదవ్, యువకులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు, పురుషోత్తంకు అభినందించారు.

# కొల్లాపూర్ కాంగ్రెస్ టికెట్ చింతలపల్లి జగదీశ్వర్‌రావుకే ఇవ్వాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

**చిన్నంబావి, జూన్27,ప్రభాతవార్త:** చిన్నంబావి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ... కొల్లాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసిన నాయకుడు చింతలపల్లి జగదీశ్వర్‌రావుకే టికెట్ కేటాయించాలని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. ఈ సమావేశంలో చిన్నంబావి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ..కొల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు చింతలపల్లి జగదీశ్వర్ రావు కొల్లాపూర్ నియోజకవర్గంలో కనివినీ ఎరుగని రీతిలో లక్ష మందితో మన ఊరు మన పోరు భారీ బహిరంగ సభ నిర్వహించి కొల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలలో నూతన ఉత్సా హాన్ని నింపారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ తీసుకున్న ప్రతిష్టా త్మక కార్యక్రమం డిజిటల్ కాంగ్రెస్ పార్టీ సభ్యత్వాలతో రాష్ట్రంలోనే మూడవ స్థానంలో, అదే విధంగా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి,కోడంగల్ నియోజకవర్గం తరువాత 2వ స్థానం లో కొల్లాపూర్‌లో 54వేల పైచిలుకు సభ్యత్వాలను నమోదు చేసి కొల్లాపూర్ నియోజకవర్గంను రాష్ట్రంలోనే కీర్తి ప్రతిష్టలు , ప్రత్యేక గుర్తింపు తెచ్చారు. అదే విధంగా ఏఐసీసీ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర తెలంగాణ రాష్ట్రంలో అడుగు పెడుతున్న సందర్భంగా కొల్లా పూర్ నియోజకవర్గం నుండి 10వేల మంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను తీసుకువెళ్లి ఘన స్వాగతం పలికారు. చింతలపల్లి జగదీశ్వర్ రావు కొల్లాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని తన భుజాలపై వేసుకుని గ్రామ గ్రామాన తిరిగి కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు కృషి చేశారన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ టికెట్ కొత్తగా వచ్చే వారికి ఇస్తే చూస్తు ఊరుకోమని తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో చిన్నంబావి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు దగడపల్లి గ్రామ మాజీ సర్పంచ్ ఖాదర్ యాదవ్, చిన్నంబావి మండల కిసాన్ సెల్ అధ్యక్షులు పుల్లారెడ్డి, మండలంలోని గ్రామ అధ్యక్షులు జగపతి రావు, మోహన్ రెడ్డి, విష్ణు,లక్ష్మణ్‌గౌడ్, రాంసింగ్, బాలు గౌడ్, డీఎన్ రాము, రఫీద్, ఈశ్వర్ రెడ్డి, వెంకటస్వామి, కాంతారెడ్డి, మండలంలోని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత: కేసు నమోదు

**పెబ్బేరు,జూన్27,ప్రభాతవార్త:** రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగదీశ్వర్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని 44వ జాతీయ రహదారిపై ఆనంద్ భవన్ దగ్గర వాహనాలను తనిఖీ చేస్తుండగా అలంపూర్ నుండి బొలెరో వాహనంలో అక్రమంగా 40 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తున్న వెంకటేష్ డ్రైవర్ కురుమూర్తి లను అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు. అక్రమంగా కోళ్ల ఫారంలకు బియ్యం తరలిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టివేసిన దృశ్యం →



## భారత సేవాశ్రమ సంఘం సేవలు భేష్

**●మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ జి. రవినాయక్**



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ రవినాయక్



వసతి గృహాన్ని సందర్శిస్తున్న కలెక్టర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్27 ,ప్రభాతవార్త:** విద్యార్థులు క్రమ శిక్షణతో పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ జి రవి నాయక్ అన్నారు. భారత సేవాశ్రమ సంఘం ప్రతినిధి స్వామి మునీశ్వరానంద జీ ఆధ్వర్యంలో మంగళ వారం మహబూబ్‌నగర్ కలెక్టర్ బంగ్లా చౌరస్తా వద్ద ఉన్న బాలికల ప్రభుత్వ వసతి గృహం, మోడల్ బేసిక్, బాలికల వసతి గృహం , బాలికల ఉన్నత పాఠశాల, బీపీహెచ్,రాంనగర్, పోలీస్ లైన్ పాఠశాల, ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు ఉచిత నోటు పుస్తకాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా బాలికలవసతి గృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ వసతి గృహంలో చదువుతున్న విద్యార్థులు చక్కగా చదువుకొని అన్ని రంగాల్లో సర్వతోము ఖాభివృద్ధిని సాధించాలని కోరారు. వసతి గృహవిద్యార్థులు పదో తరగతిలో మంది జీపీఏ సాధించడం అభినందించదగ్గ విషయమన్నారు. జెడ్పీ చైర్ పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ కృషికి తోడుగా భారత్ సేవాశ్రమ స్వచ్ఛంద సంస్థలుకూడా పేదవిద్యార్థులకుచేయూత నివ్వడంహర్షనీయ మన్నారు.కార్యక్రమంలో డీఈవో రవీందర్, రెడ్‌క్రాస్ చైర్మన్ లయన్ నటరాజ్,డాక్టర్ శ్యామ్యూల్,ఎస్సీ ,బీసీకార్పొరేషన్‌లఈడీలుజయశ్రీ పాల్గొన్నారు.

## మంత్రి ఫాం హౌస్ కోసమే రైతుల భూములు లాక్కొంటున్నారు

**- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్**



మాట్లాడుతున్న డాక్టర్. ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్

**గోపాల్‌పేట, జూన్27,ప్రభాతవార్త:** మంత్రి నిరంజన్‌రెడ్డి తన ఫాం హౌస్ కోసమే చెరువు కట్టఎత్తు పెంచి 300 ఎకరాల పేద రైతుల భూములను నీళ్లల్లో ముంచుతున్నాడనిబహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. బహుజన రాజ్యాధికార యాత్రలో భాగంగా వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలో మంగళవారం పర్యటించారు. యాత్రను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. బుద్దారం గ్రామంలో మంత్రి ఫాం హైస్ నుండి బోటింగ్ చేయడం కోసమే రైతుల భూములు బలవంతంగా గుంజుకొని చెరువు కట్ట ఎత్తు అమాంతం పెంచుతున్నారని అన్నారు. దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న రైతులను మంత్రి పోలీసులతో భయపెడుతున్నారని ఆయన ఆరోపించారు. పర్యాటకం పేరుతో రైతుల భూములను లాక్కోవద్దని హెచ్చరించారు. రైతు ముఖ్యమంత్రిగా చెలామని అయ్యే కేసీఆర్‌కు రైతుల కన్నీళ్లు పట్టవన్నారు. జిల్లాలో మంత్రి నిరంజన్‌రెడ్డి ఆగడాలు ముఖ్యమంత్రి కేసీఆర్ కు కనిపించడం లేదా అని ఆయన ప్రశ్నించారు. రూ.1400 కోట్లతో కట్టిన సచివాలయానికి సీఎం కేసీఆర్ ఏనాడు రావడం లేదన్న ఆయన సెక్రటేరియేట్‌కు రాని ముఖ్యమంత్రి కి నెలకు రూ.3,36,000 జీతం ఎందుకుని నిలదీశారు.ప్రజల సొమ్మునుదోచుకుంటూ కేసీఆర్ కుటుంబం విలాసవంతమైన జీవితం గడుపుతున్నారని విమర్శించారు. కేవలం ఎన్నికల్లో లబ్ధిపొందడం కోసమే కేసీఆర్ బీసీలకు లక్ష రూపాయలు, గృహలక్ష్మి పథకాలు ప్రకటిస్తున్నాడని వాటిని ప్రజలెవ్వరు నమ్మవద్దన్నారు.బీఎస్పీ అధికారంలోకి వస్తే లక్షల కోట్ల సంపద మీద పేదలకు అధికారందక్కుతుందనిఅన్నారు. బహుజనులంతా ఏకమై వచ్చే ఎన్నికల్లో బీఎస్పీ పార్టీని గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కృష్ణయ్య, ఇంచార్జీలు నాగనమోని చెన్న రాములు,పంబఎల్లస్వామి, నాయకులుమిద్దె మహేష్, గడ్డం మహేష్, రంజిత్, రాములు, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పేకాట ఆడిన వ్యక్తులచే మొక్కలు నాటిచ్చిన ఎస్ఐ

**పెబ్బేరు, జూన్27,ప్రభాతవార్త:** పేకాట ఆడిన 8 మంది వ్యక్తుల చేత మొక్కలు నాటించినట్లు ఎస్ఐ జగదీశ్వర్ తెలిపారు. మంగళవారం మున్సిపాలిటీ కేంద్రంలోని జూరాల క్యాంపు సమీపంలోని పోలీస్ క్వార్టర్స్‌కు కేటాయించిన స్థలంలో ఒక్కొక్కరి చే రెండు మొక్కలు నాటిచ్చినట్లు ఆయన తెలిపారు.

## స్వీపర్ల జీతాలు పెంచాలి

**- ఆందోళనకు మద్దతు తెలిపిన టీపీసీసీ నేత హర్షవర్ధన్‌రెడ్డి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్27, ప్రభాతవార్త :** పాఠశాలలో పని చేసే స్వీపర్ల సమస్యలు పరి ష్కరించాలని డిమాండ్ చేస్తూ మహ బూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపం వద్ద స్వీపర్లు నిర్వ హిస్తున్న ఆందోళన రెండో రోజుకు చే రుకున్నది. స్వీపర్ల ఆందోళనకు టీపీ సీసీ నేత, తెలంగాణ రాష్ట్ర త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి మద్దతు తెలిపి మాట్లా డారు.రాష్ట్రంలో అన్నిపాఠశాలలో స్వీ పర్లు దశాబ్ద కాలంగా కేవలం రూ. 1623, కొంతమంది మాత్రం రూ.4 వేలకు పని చేస్తున్నారని వారు ఆ జీతంలో కుటుంబాన్ని ఎలా రెట్టుకొస్తారని ఆవేదన వ్యక్తం చేశా రు. ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వ టీచర్లు ఉంటారని, మరీ ప్రభుత్వ స్వీపర్లు ఎందుకు ఉండరనిప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అందరినీ రెగ్యులరైజ్ చేయాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగ విరమణ తర్వాతరూ.10లోలగ్రాట్యుటీతోపాటు ప్రతినెలా రూ.10 500 పెన్షన్ ఇవ్వాలని, ఆరోగ్య కార్డులు ఇవ్వాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పై డిమాండ్లను ప్రభుత్వం అమలు చేయాలని, లేని పక్షంలో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చేర్చుతామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్వీపర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు గట్టన్న, టీఎఫ్‌యూజిల్లా అధ్యక్షుడు పివిజయ్‌కుమార్, స్వీపర్లు పాల్గొన్నారు.

## దళిత జర్నలిస్టులకు డబుల్ బెడ్‌రూములు ఇవ్వాలి

**గద్వాల ప్రతినిధి,జూన్ 27 ప్రభాతవార్త :** అక్రిడేషన్ కమిటి మెంబర్లు స్థానిక దళిత జర్నలిస్టులకు కల్పించాలని దళితబంధు పథకంలో దళిత జర్నలిస్టులకు ప్రత్యేక నిధులు ఏర్పా టు చేయాలని ప్రెస్ అకాడమి ఛైర్మన్‌గా దళిత జర్నలిస్టులకు అవకాశం కల్పిం చాలని జోగులాంబ గద్వాల, రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న దళిత జర్నలిస్టులకు డబుల్ బెడ్‌రూంలు ఇవ్వాలని దళిత జర్నలిస్టుల ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షులు కాశపోగు జాన్ కోరారు. ఏళ్ల తరబడి పని చేస్తున్న సీనియర్ జర్నలిస్టులకు అక్రిడషన్ కమిటి మెంబర్లు స్థానం కల్పించాలన్నారు. దళితబంధు పథకంలో దళిత జర్నలిస్టులకు ప్రత్యేక నిధులు ఏర్పాటు చేసి అర్హులైన ప్రతి దళిత జర్నలిస్టుకు దళిత జర్నలి స్టులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రెస్ అకాడమి ఛైర్మన్‌గా దళిత జర్నలిస్టులకు అవకాశం కల్పించాలన్నారు. కొన్నేళ్ల నుంచి దళిత జర్నలిస్టులు ప్రభుత్వ పథకాలు అందడం లేదన్నారు. వారి ఆర్థికాభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు.

